# కొత్త పుస్తకాలు

## మొగలి పొదలు

[రచన: శిఖా (గంటి) వెంకటరమణ. ప్రచురణ: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్, విజయవాడ—2. 232 పేజీలు. వెల: రు. 5—00.]

మొగలి పొదల్లో ఆకులకు ముళ్ళున్నా, వాటి మధ్యగా విచ్చుకొన్న పువ్వుకి అందం ఉంటుంది; వాడినా వదలని సువాసన ఉంటుంది రేకులకు. ఈ కథలో మొదటినుండి చివరవరకు కనిపించేవి ముళ్ళే. సువాసనకోసం వెతుకులాడితే నిరాశ తప్పదు.

ఈ కథలో అవసరమైనవీ, అనవసరమైనవీ ఎన్నో స్త్రీ పాత్రలు, మరెన్నో సంఘటనలు. అన్నిటిలో ఒక్కటి కూడా సహజంగా లేకపోవడం చెప్పుకోదగ్గ విశేషం.

ఈ కథతో పూర్తిగా సంబంధం ఉన్న ఒకేఒక పురుష పాత్ర శ్రీనివాస్. మిగిలిన వాటి రాకపోకలు కథని అనుసరించికాక, రచయిత్రి ఇష్టానిష్టాల్నిబట్టి వచ్చి పోతుంటాయి. శ్రీనివాస్‌కి హీరో కుండవలసిన లక్షణాలు అన్నీ ఉంటాయి, ఒక్క డబ్బు మినహాయిస్తే. అతణ్ణి ప్రేమించి, పెళ్లి చేసుకొంటుంది రాజేశ్వరి.

ఆమె దోతమాషా అయిన కథ. సవతి తండ్రి (తెలుగు పాఠకులకు ఈ పదం కొత్తది. నవత కోసం ఈ నవలలో రచయిత్రి ప్రవేశపెట్టిన అతి ముఖ్యమైన సన్నివేశాల్లో ఇది ఒకటి) కూతుర్ని కాంక్షిస్తే, కన్నతల్లి కిమ్మనకుండా చూస్తూ ఊరుకొంటే, ఇల్లు విడిచి వచ్చి శ్రీనివాస్‌ని పెళ్లి చేసుకొంటుంది ఆ పిల్ల.

శ్రీనివాస్ ఏదో స్కూల్లో టీచర్. ట్యూషన్లు కూడా చెబుతుంటాడు. పైగా పాటకుడు. ఇన్ని విధాల సంపాదిస్తున్నా భార్యా, తనూ తిండికి లేక బాధ పడుతుంటారు. పిల్లడి పాలకి కూడా డబ్బు లుండవు. ఇంట్లో వారిని పస్తులుపెట్టి, తండ్రి చేసిన అప్పులు తీరుస్తుంటాడు.

భర్తతోపాటు ఆ లేమిని పంచుకోలేక, అతన్ని విడిచిపెట్టి, దేవదాస్ అనే ధనవంతుడి దగ్గరికి, అతడు వ్యభిచారి, మోసకాడు, అతడి ఆర్జన అంతా ఆడవాళ్లని పట్టి విటులకు తార్చి సంపాదించిందే అని తెలిసినప్పటికీ వెళ్లిపోతుంది, జీవితంలో తాను కన్న కలలు అతడి ఇంట పండించుకోడానికి రాజేశ్వరి. ఆ సమయంలో మమత, మాతృప్రేమ అన్న పాత భావాలు ఆమె కార్యాచరణకి అడ్డు తగలకపోవడం ఈ కథలో కొత్తదనం.

ముఖ్యమైన ఇంకో స్త్రీ పాత్ర సుభద్ర. శ్రీనివాస్ సవతి తల్లి. వయసులో అతనికన్న చిన్నది. రాత్రిపూట రిక్షా తొక్కుతూ, ఆ డబ్బుతో చదువుకొని మెట్రిక్యులేషన్ పాసైన సవతికొడుక్కి, భర్తతో వాదులాడి తన మెడలో పలకసర్లు అమ్మి కాలేజీ చదువు చెప్పిస్తుంది. (ఆ పలకసర్లు పెళ్లినాటికి శ్రీనివాస్ తండ్రి గోపాలం చేయించినవే. అయితే, అతడి మొదటి భార్య జానకి జబ్బుతో మంచానపడితే మందుకి డబ్బులులేక శ్రీనివాస్ రిక్షా తొక్కి, అతడి చెల్లెలు సరస్వతి ఇరుగింట, పొరుగింట అంట్లుతోమి ఎందుకు సంపాదించవలసి వచ్చింది? ఆ వాడు పెళ్లాం అంత్యక్రియలకి డబ్బులేని పెద్దమనిషి నెల తిరక్కుండా నగ లెలా చేయించేడు — అంటే? ఇటువంటి అసందర్భాలు ఈ కథలో చాలానే ఉన్నాయి. ఇది మచ్చుకి మాత్రమే.)

భర్త చనిపోయేక సుభద్ర పక్కఇంటి పడుచువాడితో ఇల్లు వదలి, అలా ఎన్నో చేతులు మారుతూ, కన్న బిడ్డని ఎక్కడో వదులుకొని చివరకి సానివాడలో స్థిరపడిపోతుంది. ఆమెని అక్కడ చూసిన శ్రీనివాస్, భక్తితో ఆవిడ పాదాలు తాకి నమస్కరించి, "పిన్నీ" అంటూ ఆప్యాయంగా తన ఇంటికి ఆహ్వానిస్తాడు— ఎందరో మహానుభావులు!

రాజేశ్వరి వదిలి వెళ్లిపోయేక ఎవరో పెళ్లి ప్రస్తావన తెస్తే "ఒద్దండీ, ఇంక ఈ జీవితానికి ఆ ప్రసక్తి లేదు" అని వైరాగ్యం ఒలకపోసి, మరువాక్యంలోనే "అయినా నాకు పిల్ల నేవ రిస్తా"రని దిగులుపడి, తరువాత పేరాలో ఎవర్నో ఒకర్ని పెళ్లి చేసుకోందే తను జీవించలేడని నిర్ధారించుకొంటాడు శ్రీనివాస్. తన శిష్యురాలు కృష్ణప్రియని పెళ్లిచేసుకోమని అర్థిస్తాడు. ఆమె "మీ బాబుకి తల్లిగా, మీకు ఇల్లాలుగా ఉండడం ఎంతటి అదృష్టవంతులకి —" అంటూనే నీతి, జాతి లేని నిన్ను పెళ్లాడలే నంటుంది. ఆ వార్త కాస్తా ఉత్తరం ద్వారా అతడికి అందజేసి, తల దించుకొని వడివడిగా "కటిక చీకటిలో(కి), గాఢాంధకారంలో(కి), భోరున కురిసే వర్షంలోకి" వెళ్లిపోతుంది.

ఏ భాషనుంచో ఎరువు తెచ్చుకున్న ఇతివృత్తంతో, దానిని తెలుగు జీవనానికి, సంస్కృతికి అనువుగా మలచి వ్రాయలేని అసమర్థతతో, పదాల పొందిక లేకుండా మాటలని మాలగా గుచ్చుతూ శిఖా (గంటి) వెంకట రమణగారు ఇన్ని పేజీలు ఖరాబు చెయ్యకపోతే వచ్చే నష్టం ఏముంటుంది?

గతుకుల బాటలా ఉన్న ఈ కథకి అచ్చుతప్పులు మరింత బలం చేకూర్చాయి. వాటికి సమ ఉజ్జీగానే ఉన్నాయి రచయిత్రి రూపొందించిన కొన్ని పదాల పొందిక.

ఉదా: "చక్కని నీళ్లలో గిరిగీసిన గర్వం కనిపిస్తోంది" (33 పేజీవ); "అయినా ఈడేరిన పిల్లలు సాహసంగా, పరిష్కారం లేనట్టుగా రానే రారు" (అదే పేజీ); "జగదీశ్ ఉప్పెనలా పొంగిన అంతర్నాళాలు ఒక్కసారిగా దిగంతాలకు జారిపోయేయి" (58 వ పేజీ.); "చివికిపోయే సౌధం", "చెదరిపోయే మంగళసూత్రాలు (42,43 వ పేజీలు); "తల్లి ఫోటోవైపు చూస్తుంటే అతని గుండెల్లో పేరుకున్న కఠిన శిలలాంటి బాధ తాలూకు లావా ఏదో వెన్నలా కరగి, కళ్లగుండా ప్రవహించి చెంపలమీదపడుతున్నాయి బొట్లుబొట్లుగా రాలి" (16 వ పేజీ).

ఇటువంటివే ఇంకా ఎన్నో ...

—సుమన

## నాయకురాలు

[రచన: ఉన్నవ లక్ష్మీనారాయణ. ప్రచురణ: త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నము; మద్రాసు. వెల: రు. 3—00.]

ఆంధ్రలో జరిగిన జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' అనే ప్రశస్తమైన నవలతోబాటు ఈ ప్రశస్తమైన నాటకం కూడా రచించారు. జాతీయోద్యమ సంస్కృతిని ప్రతిబింబించే రచనలు తెలుగులో చాలా పరిమితంగానే వచ్చాయి. వాటిలో ఉన్నవ వారి రచనలకు గొప్ప స్థానం ఉన్న దనటానికి సందేహం ఏమాత్రమూ లేదు.

అందులోనూ 'నాయకురాలు' నాటకానికి ఒక ప్రత్యేకత కూడా ఉన్నది. పల్నాటి గాథ ఆంధ్ర చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం గలది. దాయాదుల మధ్య అంతఃకలహం కావటం చేత ఈ గాథకూ, భారతానికీ ఏనాడో సామ్యం పుట్టింది. పాత్రలు కూడా ఒనగూడాయి. బ్రహ్మనాయుడు కొంతవరకు ధర్మరాజునూ, కొంతవరకు కృష్ణుణ్ణీ పోలుతాడు. నలగామరాజు దుర్యోధనుడు, కేతిరెడ్డి శకుని, నరసింగరాజు దుశ్శాసనుడు, నాగమ్మ కర్ణుడు, బాలచంద్రుడు అభిమన్యుడు—ఇలా సామ్యాలు కనబడతాయి, అవి పూర్తిగా అతకకపోయినా.

ఈ నాటకం ద్వారా ఉన్నవ వారు గత చరిత్రను పునరుజ్జీవింప జెయ్యటంతోబాటు గాంధీ సిద్ధాంతాలనూ, గాంధీ శకానంతరం వచ్చిన సిద్ధాంతాలనూ కూడా వివిధ పాత్రలచేత పలికించారు.

పల్నాడు రెండు కావటం పాదిలె పాపాన్న సహించలేడు. "రెండు రాజ్యాలకూ (గురిజాల, మాచెర్ల రాజ్యాలు) విరోధాలు బలమయినవా అంటే, మధ్య సన్నవాండ్లం నలుగుతాం" అంటాడు. ఎంత నిజం! కాని బ్రహ్మనాయుడు "పది చీలికలుకాదు, పదివేల చీలికలయినా నా కిష్టమే. ... పల్నాడంతా పరిజనులకందరికి పదిలక్షల చెక్కలుచేసి, పంచిపెట్టి, ఏ బాధలూ లేకుండా వ్యవసాయం చేసుకొని జీవించమని చెప్పడమే నా కిష్టం. ఎన్ని భాగాలు చేసినా పల్నాడు పల్నాటి ప్రజలకే ఉంటుంది" అన్నది తిరుగులేని మాటే గదా.

పల్నాటియుద్ధానికి మూలకారణాలుగా చెప్పబడే వాటిలో చాపకూడు ఒకటి. నాయకురాలు నాతుర్వర్ణ్యంకోసం నిలబడిన శివభక్తురాలయితే, బ్రహ్మనాయుడు వర్ణవ్యవస్థనూ, అస్పృశ్యతనూ నిర్మూలించి అందరిచేతా చాపకూడు తినిపించటానికి కంకణం కట్టుకున్న వీర వైష్ణవుడు. ఈ విధంగా బ్రహ్మనాయుడి పాత్ర గాంధీ సిద్ధాంతాలు పలకటానికి అనువైన పాత్ర అయింది. నాటకంతో

"దుష్టులతోను, శిష్టులతోను చేర్పరాని దీన జనులను పరిపాలించడం రాజుయొక్క ... ధర్మం ... భూమి ఏ భారమయినా మోయగలదు గాని ధనికుడి భారము మోయలేదు ... ఇహము ఆముష్మికానికి మెట్టుగా ఉండాలె... సైనికులకోసం సనాతనధర్మ వాదులం కాజాలము ... చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా ఉన్నంతకాలం మన ధర్మము నెవరూ పాటించరు. అగ్రవర్ణముల వారికంటె పంచము లెక్కువ దుర్మార్గులుకారు... వారిని బాగుచేయవలసిన భారము అగ్రవర్ణముల మీదనే నిలచి ఉన్నది"—"ఇలాటి భావాలు బ్రహ్మనాయుడు వెలిబుచ్చాడు. "పారిపోవడం కంటె హింసించడమే మేలు" అంటాడు.

బ్రహ్మనాయుడు కేవలమూ గాంధీయిజముకే ప్రతినిధి అనుక నవసరంలేదు. ఆయనది చాలా సూక్ష్మ దృష్టి. బ్రహ్మనాయుడి పోరాటం పంచను — పంచమేతర తగాదాలోకి దిగుతుందని కన్నమనీడు అంటే, "అంతకంటె బీదల—భాగ్యవంతుల తగాదాలోకి దిగుతుందంటే సరిపోతుంది" అంటాడు బ్రహ్మనాయుడు. "గెలువగలమను ఆశ లేనిది ఎవడూ ఏ పనీ తల పెట్టడు... వెనుకకు లాగడం శంకితుని పని. ముందడుగు వేసేవాడు సాహసుడు" అనే కార్యదక్షుడు.

మరొక నాటకకర్త అయితే బ్రహ్మనాయుడి ప్రతిపక్షం వారిని హీనంగా చిత్రించి ఉండవచ్చును. కాని ఉన్నవ వారు అలా చెయ్యలేదు. నాగమ్మ పాత్ర పట్ల కూడా మనకు ద్వేషం కలగదు. దృక్పథాల మధ్య తేడాకి ఇచ్చిన ప్రాధాన్యం వ్యక్తులకు ఇవ్వబడలేదు. ఈ నాటకంలో ప్రేక్షకులను జుగుప్సపరిచేది ఒకే ఒక్క సంఘటన — అలరాజు శవాన్ని నరసింగరాజు లాగిపారెయ్యటం.

అంతేకాదు, బ్రహ్మనాయుడి ప్రతిపక్షంలో చేరిన వాళ్ల నోటకూడా అనేక సత్యాలు మనం వింటాం.

"లోకములో రాముడికీ, రావణుడికీ కూడా స్వస్తి చెప్పి కాలం గడుపుకొనే వాండ్లు చాలామంది ఉంటారు. కాలు కుదిరిన తరవాత వారి పలుకుబడి ఎక్కువ కూడా కావచ్చు" అంటాడు కేతిరెడ్డి, స్వాతంత్ర్యం అనంతరం గద్దెలెక్కిన సంస్థానాధీశులు జ్ఞాపకం వచ్చేటట్టు. అతనే "యుద్ధాలుచేయకుండా రాజ్యాలు రావు" అంటాడు. "ప్రజల భావాలు పరికించి పాలించ గలవాడే ప్రభువు ... లోటిపాటలే మేటి విరులను తయారుచేసేది" అని కూడా అంటాడు.

"కత్తి అన్ని హక్కులను కలుగజేస్తుంది" అని నాగమ్మ కూడా మరో సూక్తి వల్లిస్తుంది. "పాపము దానంతట అది శమించదు" అంటుంది.

"పురుష ప్రయత్నము ఫలించడమూ, ఫలించక పోవడమూ గాదుగానీ, ఇప్పుడో, ఎప్పుడో చేసిన కర్మలకు ఫలమియ్యడం తప్ప, పరమశివుడుగాని పరకేశవుడుగాని ఏమీ ఊరక ప్రసాదించినట్టు నే వినలేదు" అంటాడు నరసింగరాజు.

"తిరిచి భోగించడం దీనుల పని" అంటాడు బాలచంద్రుడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే పాత్రలన్నీ సజీవమైనవి. స్ఫుటమైన దృక్పథాలూ, ఆశయాలుగలవి. సందర్భశుద్ధిగానూ, లౌక్యంగానూ, వ్యంగ్యంగానూ మాట్లాడగలవి. "నాటకీయత" అనుకుని వెకిలి సంభాషణలలో కూడుకున్న చెత్త నాటకాలు వెలువడే ఈ కాలంలో, దాదాపు అర్ధశతాబ్దం క్రితం రచించిన ఈ నాటకం చదువుతుంటే ప్రాణం లేచివచ్చినట్టుంటుంది.

ప్రతి అంకం ముందూ వచ్చే ప్రలాపుడి పాత్ర నాటకానికి అట్టే ఉపకరించేదిగా లేదు. నాటకం ఆరంభంలోనే హామ్లెట్ జ్ఞాపకం వస్తుంది. నాగమ్మ పురుషవేషంలో వచ్చినప్పుడు నలగామరాజు మాటలలో శృంగారం ధ్వనిస్తుంది. ఇంతకన్న వారిద్దరిమధ్య ఉన్న సంబంధం గురించిన ప్రస్తావన ఏమీ నాటకంలో లేదు. కోళ్ల పందెం అప్పుడు కొమ్మరాజు బ్రహ్మనాయుడి కన్న బాగా జరగనున్నది గ్రహిస్తాడు.

ఎన్నివిధాల చూసినా ఇది మరుగున పడిపోవలసిన నాటకం కాదు. మన పాఠకులు శ్రద్ధతో చదవదగిన నాటకం. గ్రాంధికంలో రాసినా వంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు ఈ నాటకానికి చక్కని పీఠిక రాశారు. అట్టమీద గోఖలే బ్రహ్మనాయుడి చిత్రానికి అనుకరణ ఉన్నది.

—కొ. కు.

## ప్రాచీన పాశ్చాత్య నాటక రంగం

[రచయిత: శ్రీ శ్రీనివాస చక్రవర్తి. ప్రకాశకులు: జయంతి పబ్లికేషన్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ—2. క్రౌన్ 117 పుటలు. వెల: రు. 2—00.]

నాటకరంగాన్ని గురించి ప్రస్తావించేటప్పుడు సాధారణంగా భారతీయ నాటక రంగమే స్ఫురణకు వస్తుంది. కాని, నాటకరంగాన్ని గురించి తెలుసుకొనగోరేవారు ప్రాచీన కాలంలోని పాశ్చాత్య నాటకరంగాన్ని గురించి కూడా తెలుసుకోవడం అవసరం. పాశ్చాత్యనాటక రంగాన్ని గురించి సమగ్రంగా కృషిచేసి, తెలుగులో దాని చరిత్రను ఎవరూ వెలువరించినట్లు కానరాదు. ఆ లోపాన్ని ఈ పుస్తకం చాలావరకు తీరుస్తుంది.

ఈ గ్రంథాన్ని రచించిన శ్రీనివాస చక్రవర్తి గారు పాశ్చాత్య నాటకాలను అవలోడనచేసి కొన్నిటిని అనువదించారు. నాటకములను గురించి అపూర్వ పరిశోధనలు చేసి అనేక గ్రంథాలు రచించారు. కొంత కాలం నాటక విద్యాలయానికి ప్రధానాధ్యాపకత్వం వహించారు. నాటక కళాభిజ్ఞులయిన వీరి రచన ప్రశస్తమూ, ప్రామాణికమూ అగుటలో సందేహం లేదు.

ఇందులో అతి ప్రాచీన కాలంలో పాశ్చాత్య దేశాల నాటక రంగాల పుట్టుపూర్వోత్తరాలు సంగ్రహంగా చూపబడ్డవి. నాలుగు ప్రకరణాలలో క్రమంగా ప్రాచీన గ్రీకు నాటక రంగం, గ్రీకు నాటక కవులు, ప్రాచీన రోమన్ నాటక రంగం, మధ్య యుగాల పాశ్చాత్య నాటకరంగం అనే శీర్షికల్లో ఆయా విషయాలు వివరింపబడ్డాయి. పాశ్చాత్య నాటకాలను తొలుత ప్రారంభించినవారు గ్రీకులనీ, వారిని రోమనులు అనుసరించారనీ, వారి ననుసరించి మధ్యయుగాల నాటకరంగం తయారయిందనీ సప్రమాణంగా చూపబడింది. ట్రాజెడీ, పాటిర్, కామెడీల అవతరణ, రంగాలంకరణ, నాటక పోటీలు, నాటక కవుల రచనా వైశిష్ట్యం, నాటకాల్లో అర్చనా, అద్భుత, దివ్యలీలా, నీతిభేదాలు, ప్రహసనాలు — వీటి ఉత్పత్తి ప్రయోజనాలు సంగ్రహింపబడినవి. సుప్రసిద్ధులైన గ్రీకు నాటక కవులు ఇస్కిలస్, సోఫోక్లిజ్, యురిపిడీస్, అరిస్టోఫనీస్, మెనాండర్లను గురించీ, రోమన్ నాటక కర్తలు అండ్రోనికస్, క్వింటస్ ఎన్నియస్, మార్కస్ పాక్యూవియస్‌లను గురించీ, ఆయా దేశాల నాటక చరిత్రను గురించీ ఎన్నో విషయాలు చెప్పబడి ఉన్నాయి. అనేక గ్రంథాలను పరిశీలించి కూర్చబడిన ఈ సంగ్రహ చరిత్ర, పాశ్చాత్య నాటక రంగాన్ని గురించి తెలుసుకోదలచినవారికి మిక్కిలి ఉపయోగకరమైనది. నాటక కళ విదేశాలలో అతి ప్రాచీన కాలంలో ఎలా ఉద్భవించి, ఎలా పరిణామాలు పొంది విస్తరించినదీ, ఎట్టి క్లిష్టపరిస్థితులను ఎదుర్కొని వెలసి వచ్చినదీ ఈ గ్రంథంవల్ల సులభంగా తెలుసుకోవచ్చును. నాటక కళయందు ఆసక్తి కలవారు దీన్ని తప్పక చదివి, రచయితకు తగిన ప్రోత్సాహం ఇవ్వడం ఎంతైనా ఉచితమైనది.

—ఆయాస్య

## కార్మిక స్వర్గంలో కళాప్రియుడు

[విశ్వకవి రవీంద్రుని చిరు రచనలకు కె. వి. రమణారెడ్డి అనువాదం. ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కో., ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్. వెల: రు. 2—50.]

పదేళ్ల క్రితం 'పద్మ పూజ' అనే పేరుతో విశాలాంధ్ర వారు ప్రచురించిన పుస్తకానికిది పునర్ముద్రణ. ఇవన్నీ చిన్న చిన్న కథలు, గల్పికలు, భావ చిత్రాలు... అన్నీ భావ స్ఫోరకాలే. చిన్న చిన్న రచనలే అయినా, అన్నిటా రవీంద్రుని కవిత్వపు సొబగులు క్రొంగొత్తగా కనిపిస్తాయి. హాయిగా చదివిస్తుంది.

—శార్వరి

## స్వీకారం

**సత్యజ్ఞానము** రచన: కాలెపు బాలసుబ్రహ్మణ్యం, కాలెపు బిల్డింగ్స్, జగన్నాథపురం, కాకినాడ—2. వెల: 50 పైసలు. ★

**Printed and Published on behalf of Andhra Prabha Private Ltd., by M. KRISHNASWAMI, B.A. B.L., at the Dinamani Press, Express Estates, Madras-2. Editor: P. NAGESWARARAO.**